నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
నిజామాబాద్
కామారెడ్డి
బుధవారం 23 జూలై 2025 6 పేజీలు







# సాదాబైనామాల సంగతేమిటి సారు..

- వీటి కథ కంచికేనా ?
- వందల్లో దరఖాస్తులు
ఆందోళనలో భూబాధితులు

సూర్య వేల్పూర్

రాష్ట్రంలోని భూ సమస్యలు సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి భూ బాధితులకు కొంతమేర ఆశలను నెలకొల్పారు. కానీ గతంలో ఉన్న ధరణి చట్టానికి భూభారతి చట్టానికి పెద్దగా మార్పులు ఏమీ లేవని భూబాధితులు వాపుతున్నారు. కానీ గతంలో మాదిరిగానే భూ సమస్యల పరిష్కారానికి ముగింపు పలకాలనే సంకల్పం నీరుగారి పోతుందని చెప్పవచ్చు. 2లో

## అభివృద్ధి, సంక్షేమ
## పథకాల అమలులో కలెక్టర్లు కీలకం

- కలెక్టర్లతో వీ.సీలో మంత్రులు స్పష్టీకరణ

సూర్య నిజామాబాద్, జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య (మిగతా 2లో)





పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా
## ప్రతీ సిబ్బంది విధులు నిర్వహించాలి

- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య
- ధర్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ 2లో

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



## ప్రభుత్వ ఆసుపత్రిలో బోనాలు

- పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు 2లో

సూర్య -బాన్సువాడ రూరల్



# సాదా బైనామాల సంగతేమిటి సారు...

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండలంలోని దాదాపుగా 600 వరకు అన్ని రకాలదరఖాస్తులు చేసుకున్నారు. అందులో దాదాపు పెండింగ్ ముటేషన్15, డిజిటల్ సైన్ పెండింగ్ 60, ఫౌతి కేసులు 45, మిస్సింగ్ సర్వే నంబర్లు 70, సాదాభైనామలు 300 పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి .వాటిలో ఈ ఆగస్టు 15 వరకు సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దానిలో ఇప్పుడున్న ప్రభుత్వం కొత్తగా పెట్టిన భూభారతి చట్టానికి రైతుల సమస్యలకు పొంతన లేకుండా ఉంది. గతంలో ధరణి పోర్టల్ నుండి మామూలు గానే ఫౌతి కేసుల పరిష్కారానికి అవకాశం ఉండేది. అప్పుడున్న ప్రభుత్వం ధరణి పోర్టల్ నిరంతరాయంగా కొనసాగించే ప్రయత్నం చేసిన ఆటంకాలు ఎదురవడంతో పోర్టల ను అలాగే నిలిపివేశారు .ఇప్పుడు దరఖాస్తు పెట్టుకున్న భూభాధితులు భూభారతి చట్టం ద్వారా సమస్య పరిష్కానికి ఎదురుచూస్తున్న వేళ కేవలం కొన్ని మాడ్యూల్స్ మాత్రమే మార్పులు చేర్పులు చేయడంతో మళ్లీ సాదా బైనా మా రైతులకు చేదు అనుభవం ఎదురయింది .క్షేత్రస్థాయిలో అధికారులు వచ్చి దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేసినప్పటికీ కొన్ని ఆటంకాల వల్ల ముందుకెళ్ళ లేకపోతున్నారు. సదా బైనామా లు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటిపై ఎవరికి ఇంతవరకు సమాచారాన్ని అందించలేదు. అయితే సాదాబైనామను దరఖాస్తు చేసుకున్న రైతులు కొనుగోలు చేసినవి పట్టా భూముల లేదా అసైన్డ్ భూముల ప్రభుత్వ భూముల అన్నది సందేహం గానే మిగిలిపోయింది .పట్టా భూములయితే సాధారణంగా మీసేవ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని రైతులు పాసుబుక్కులు పొందేవారు. కానీ రైతులు కొనుగోలు చేసినవి అసైన్డ్ భూము లు కావడంతో చట్టాన్ని అనుసరించి దీనిని వేరొకరికి మార్పులు చేర్పులు చేయడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతమున్న ప్రభుత్వం భూభారతి చట్టాన్ని కొంతమేర మార్పు లు చేస్తూ సాదాబైనా ద్వారా కొనుగోలు చేసిన భూములను క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి గ్రామాల్లో సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన భూముల్లో ప్రస్తుతం ఉన్న కొనుగోలుదారు స్వాధీనంలో ఉన్నాడా లేదా విక్రయించిన వ్యక్తి స్వాధీనంలో ఉన్నాడా అనేది సర్వే నిర్వహించి మార్పులు చేయాలని భూ బాధితులు కోరుతు న్నారు. ఒకవేళ ఇలా సర్వే నిర్వహించిన అనం తరం పట్టా భూములు లాగానే అసైన్డ్ భూము లకు ప్రభుత్వ భూములకు తగు రుసుమును చెల్లించే విధంగా ప్రణాళిక చేస్తూ పట్టా మార్పిడి చేయడానికి అవకాశాలను కల్పించాలని కోరుతు న్నారు. సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములు గత కొన్ని సంవత్సరాల నుండి విక్ర యించిన వారిపై ఉండడంతో గ్రామాల్లోని విక్రయించిన వ్యక్తి మరణించడంతో స్వాధీనంలో ఉన్న వ్యక్తికి విక్రయించిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఇప్పుడు పట్టామార్పి చేసుకోవడానికి సంతకాలు పెట్టడానికి ససేమిరా అంటున్నారు. అదేవిధంగా పేద రైతులకు పంపిణీ చేసిన అసైన్ చేసిన భూములను ఎలా మార్పిడి చేయా లో అర్థం కాక గతంలో ఉన్న ప్రభుత్వం ఆపసోపాలు పడడంతో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం సాదాబైనావ ద్వారా కొనుగోలు చేసిన భూ బాధితులకు ఆశలను కల్పించి చివరికి నిరాశను మిగిలించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారు లు లేకపోవడం అలాగే ఇప్పుడున్న తహసిల్దార్ జిల్లాలు మారి పోవడంతో కొత్తగా వచ్చిన తహసీల్దారు భూ సమస్యలను తీర్చడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీనికి కారణం క్షేత్రస్థాయిలో గ్రామానికి సంబంధించిన రెవెన్యూ ఉద్యోగం లేకపోవడంతో తాసిల్దార్ కు తగిన సమాచారం ఇచ్చే వ్యక్తులు లేకపోవడం వల్ల ఈ సమస్య వస్తుందనేది స్పష్టంగా తెలుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం వీఆర్ఏలను మళ్లీ గ్రామాల్లోనికి జీపీవోలుగా తీసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగించిన ఇప్పటివరకు అది అమలులోకి రాకపోవడంతో ఇబ్బందుల గురవుతున్నారనేది వాస్తవం. మరి ఇట్టి భూభారతి పోర్టల్ ను నిరంతరాయంగా కొనసాగిస్తారా అనే విషయం సందిగ్ధం గానే ఉన్నది .ఎందుకంటే దరఖాస్తులు తీసుకోవడానికి వచ్చిన అధికారులు తదుపరి మండల స్థాయిలో దరఖాస్తు స్వీకరించి ఒక కటాఫ్ డేట్ నిర్ణయించి దరఖాస్తులు స్వీకరణ నిలిపివేశారు .మరి ఇప్పుడు కొన్ని మాడ్యూల్స్ ద్వారా డిజిటల్ సైన్, పెండింగ్ ముటేషన్, మిస్సింగ్ సర్వే నంబర్ వంటి భూములను సమస్యల ను తొలగించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కానీ వచ్చి పడిందల్లా సాదా బైనామ సంగతి . సాదా బై నామాల బాధితుల సమస్యలను ఎవరు చూస్తార నేది అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. ఇకనైనా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిజా నిజాలను గమనించి సాదా బైనామాలను పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేయాలని భూబా ధితులు కోరుతున్నారు. మరి దీనిపై ప్రభుత్వం గతంలో ఉన్న అసైన్మెంట్ చట్టాన్ని ధిక్కరిస్తుందా లేదా కొనుగోలు చేసిన వ్యక్తులకు పట్టా మార్పిడి చేస్తారనేది అర్థం కాని ప్రశ్న గా మిగిలిపోయింది. ఏది ఏమైనా సాదా బైనామా సంగతి మళ్ళీ అటకెక్క విధంగా కనిపిస్తుంది.

# అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకం

**(మొదటి పేజి తరువాయి)**

కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పథకాల అమలు పురోగతిని సమీక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి వీ.సీలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహాలలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై మంత్రులు సమీక్షిస్తూ, కలెక్టర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో వాటి అమలులో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందిం చుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, వారంలో ఒకరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలని ఆదేశించారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించేలా చూడాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు నిర్వాహణ తీరును పర్యవేక్షించడంపై పలు సూచనలు చేశారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రగతిని మంత్రులు సమీక్షిస్తూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారునికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని అన్నారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బోనాలు

**సూర్య -బాన్సువాడ రూరల్**



బాన్సువాడ పట్టణ కేంద్రంలోని మాత శిశు సంక్షేమ ఆసుపత్రిలో మంగళవారం ఆషాడ మాసం సందర్భంగా బోనాల పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజులు పాల్గొన్నారు.బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఆస్పత్రి సూపరిండెంట్ విజయలక్ష్మి, పిఎస్ఆర్ టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, ఎజాజ్, యువ నాయకులు మహమ్మద్ గౌస్ , ఆస్పత్రి సిబ్బంది,టాక్సీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ రికార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలి

## - బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



రైతులకు డిజిటల్ రికార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని అన్ని బ్యాంకులకు సూచించామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల మంజూరు కోసం బ్యాంకులు రైతుల పట్టాదార్ పాస్ బుక్కులను తమ వద్ద అట్టి పెట్టుకోవాల్సిన అవసరం లేదని, పాస్‌బుక్ పేరుతో దరఖాస్తుదారులకు రుణాలను తిరస్కరించకూడదని అన్నారు. భూ భారతి చట్టం - 2025 లోని సెక్షన్ 10(6), సెక్షన్ 10(7) ల ప్రకారం, భూములపై రుణాలను మంజూరు చేసే సందర్భంలో భూ హక్కుల రికార్డులను ఉపయోగించి రుణాలను ప్రాసెస్ చేయాలన్నారు. రుణాల కోసం బ్యాంకులు రైతులకు సంబంధించిన పట్టా పాస్‌బుక్ -కమ్- టైటిల్ డీడ్‌ను తమ వద్ద ఉంచుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను అత్యవసరంగా పరిగణిస్తూ, వెంటనే అమలు చేయాలని బ్యాంకర్లకు ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు.

# పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా ప్రతీ సిబ్బంది విధులు నిర్వహించాలి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ధర్పల్లి సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం నాడు సందర్శించడం జరిగింది. ముందుగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ నిజామాబాద్ ఏసిపి, ధర్పల్లి ఇన్స్పెక్టర్, ధర్పల్లి ఎస్సై, సిరికొండ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్ ను క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించారు. పోలీస్ విభాగము నిర్విరామముగా నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల యొక్క భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది.ధర్పల్లి సర్కిల్ పరిధిలోని రికార్డ్ లను పరిశీలిస్తూ , అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ సర్కిల్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు , కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి , అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు.ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు సిబ్బంది 24%శ%7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకటరెడ్డి , ధర్పల్లి సిఐ బిక్షపతి , ధర్పల్లి ఎస్.ఐ ఎం. కళ్యాణి , సిరికొండ ఎస్.ఐ జె. రామకృష్ణ మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**సూర్య మాక్లూర్**



ఆలూర్ మండలం కల్లెడ గ్రామంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి,ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు డేగ పోశెట్టి, నీలగిరి శ్రీనివాస్,ఆలూరు మండల యూత్ ప్రెసిడెంట్ సిరికొండ మహేష్,హబీబ్,గంగారం,రవి, నర్సింగ్,బోరన్న,తదితరులు పాల్గొన్నారు.

# సిఐటీయు కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ఉదయం ఐదు గంటల నుండి కామారెడ్డి మున్సిపల్ ఆఫీస్ ముందు మున్సిపల్ కార్మికుల వేతనంలో వెయ్యి రూపాయలు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మరియు CITU జిల్లా కన్వీనర్ k చంద్ర శేఖర్ హాజరైన్నారు రాజమల్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో లేని విధముగా కేవలం కామారెడ్డి మున్సిపల్ లోని మున్సిపల్ కార్మికుల జీతాల నుండి పాదాల ఆరువందల రూపాయల నుండి 1000 రూపాయలు తగ్గిస్తూ బిల్లులు చేయడం వలన కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఇది సరైన పద్ధతి కాదని వారు మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నాలు వారు హెచ్చరించారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికుడు చనిపోతే వారి ప్లేస్ లో అలాగే 60 సంవత్సరాలు నిండిన కార్మికుల ఇంటిలో కొరకు ఉద్యోగం ఇవ్వాలని జీవో ఉన్న కమిషనర్ రాజేందర్ రెడ్డి స్పందించకపోవడంతో మరియు



పాత కార్మికులను అనారోగ్యంతో బంద్ అయిన కార్మికులను తిరిగి విధులకు తీసుకోవాలని కౌన్సిల్ తీర్మానం ప్రకారం సి ఆర్ 271 ఉన్నప్పటికీ అనవసరంగా కార్మికుల తొలగిం చడం వలన కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న అధికారులు స్పందించడం లేదు జనాభా ప్రాతిపదికంగా పోయిన కౌన్సిల్ 30 మందికి అదనంగా కౌన్సిల్ తీర్మానం తీసుకున్న అందులో 11 మంది కార్మికులకు ఆరు నెలల జీతాలు ఇవ్వకుండా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు కలరా డెంగ్యూ మలేరియా వచ్చే అవకాశం ఉన్నదని ప్రజల ఆరోగ్య దృశ్య కార్మికులను తీసుకోవాలని అకారణంగా తొలగించడం కౌన్సిల్ తీర్మానానికి వ్యతిరేకం కావున మున్సిపల్ కమిషనర్ కి రాష్ట్ర నాయకత్వం సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడంతో వేయి రూపాలు తగ్గించడానికి విరమించుకుంటామని మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తానని 60 సంవత్సరాలు నిండిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో సూచించిన వారికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఆలోచన చేస్తామని స్థానిక సమస్యలు పరిష్కరించడానికి కొంచెం సమయం కావాలని వారు చెప్పారు.రెండు రోజుల్లో మీ జీతాలు వచ్చే విధంగా చూస్తానని సంబంధిత అధికారులు పిలిపించుకొని మాట్లాడంతో పాటు వారు హామీ ఇచ్చారు. హామీ ఇవ్వడంతో ధర్నాను ముగించుకోవడం జరిగింది. రాబోవు రోజుల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే ఎప్పటికైనా సమ్మె కు పోతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజనర్సు జిల్లా కార్యదర్శి మహబూబ్ అలీ నాయకులు దీవెన శివరాజవ సంతోష్ ప్రభాకర్ ప్రభు జ్యోతి సంగం సావిత్రి, నడిపి నరసవ్వ, విజయ్, ప్రవీణ్, గురజాల నరసింహులు, సుమారు 250 మంది పాల్గొన్నారు.

## కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ కే రషీద్ ను సన్మానించిన విద్యార్థి సంఘాల నాయకులు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా కేంద్రం లోని విద్యార్థి సంఘాల నాయకులు కర్షక్ బి.ఈడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ కే రషీద్ ను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన ద్వితీయ స్నాతకోత్సవంలో భాగంగా కర్షక్ బిఈడి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి వరుసగా ఐదు బంగారు పథకాలు తీసుకురావడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాల వైపు ప్రోత్సహించి తీర్చిదిద్దిన ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ కే రషీద్ మరియు అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకి అభినందనలు తెలియజేశారు.విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.ఈ విజయాల పరంపర ఇలాగే కొనసాగించాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు ఐరేని సందీప్, ఆజాద్, బాలు, ముదాం అరుణ్, జీవీఎం విటల్, సురేష్, నాగరాజు, లక్ష్మణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య -మోపాల్**

నిజామాబాద్ గిరి రాజ్ ప్రభుత్వ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి అతిథి ఒప్పంద ప్రాతిపదికిన పలు సబ్జెక్టులు బోదించేందుకు ఆర్యత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తిర్ణులై ఉండాలని, నెట్, పీఎచ్ డీ, ఆర్యత కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అన్నారు.ఈ నెల 23 సాయంత్రం 5గంటల వరకు విద్యా ధ్రువపత్రాలు బయోడేటా, ప్రస్తుత పీపీ ఫోటో, చరవాణి వివరాలతో కళాశాల కార్యాల యంలో సమర్పించాలన్నారు.24న ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూ, డెమో నిర్వహించునున్నట్లు పేర్కన్నారు. ఖాళీలు :-

పొలిటికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ (ఉ. మీ.), కామర్స్, మ్యాథమేటిక్, హిస్టరీ, బ్యాచిలర్ అప్ బిజినెస్, అడ్మినిస్ట్రేషన్, స్టాటి స్టిక్స్, ఆంగ్లం, బీబీఏ లాజిస్టిక్, ఫిజిక్స్, ఏకనామిక్స్, బిజినెస్ అనాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, తెలుగు, ఫైనాన్స్, బీసీఏ, టాక్షేషన్, డేటా సైన్స్, బయోటెక్నాలజీ,

## ఘనంగా దాశరథి జయంతి ఉత్సవాలు

### - డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె విజయ్ కుమార్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ (ఎ) కళాశాల, కామారెడ్డి తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రోజున "దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాన్ని" ఘనంగా నిర్వాహించారు. ఈ సమావేశానికి హాజరైన కళాశాల ప్రినిపాల్ డా. కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వంపై తిరుగుబాటు ఉద్యమంలో పాల్గొని తన రచనలు, ప్రసంగాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాడన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె. కిష్టయ్య మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే తెలంగాణ రైతాంగ, సాయుధ పోరాటాల్లో పాల్గొని ప్రజల్లో అభ్యుదయ భావాలను కలుగజేయడమే కాకుండా, "నా తెలంగాణ కోటి రతనాల వీణ" సగర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి అండగా నిలబడ్డారని తెలియజేశారు. తెలుగు శాఖ అధ్యక్షులు డా. పి. విశ్వప్రసాదు మాట్లాడుతూ దాశరథి పీడిత ప్రజల పక్షాన నిలబడుతూ రాచరికంతో తిరుగులేని పోరాటం చేశారని 'తెలంగాణను కోటి రత్నాల వీణగా భావించినప్పటికీ తర్వాత జరిగిన పరిణామాలలో సమైక్యాంధ్ర వైపు మొగ్గుచూపడం ఆలోచించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశంలో IQAC కో-ఆర్డినేటర్ జయప్రకాశ్, మాథ్స్ విభాగపు అధ్యాపకులు రాజేందర్, కామర్స్ అధ్యాపకురాలు కవిత మేడం, తెలుగు అధ్యాపకులు కె. రవి కుమార్, జి. మల్లేష్, ఎన్. ఆంజనేయులు, సోషల్ వర్క్స్ అధ్యాపకులు డా. రమేష్, డా. సత్యం హిందీ విభాగ అధ్యాపకులు డా. బాలాజీ మరియు విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గ్రీన్ రెవల్యూషన్ లో భాగంగా చెట్లు నాటిన జడ్పిహెచ్ఎస్

**సూర్యఏర్గట్ల**



నిజాంబాద్ జిల్లా ఏర్గట్ల మండలం లోని తడపాకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పర్యావ రణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవసరం అనే సంకల్పంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కార్యక్రమం మరియు ఎకో క్లబ్ లో భాగంగా మంగళవారం రోజున చెట్లు నాటారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు M.A జావిద్ మాట్లాడుతూ పిల్లల్లో చిన్న వయసు నుంచే మొక్కలు నాటడం ద్వారా వారు భవిష్యత్తులో బాధ్యత యుత పౌరులుగా ఎదుగవచ్చని వారికి పర్యావరణం పై ప్రేమను పెంపొందించవచ్చని అన్నారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే ఒక విద్యార్థి ఒక చెట్టు అనె సిద్ధాంతాన్ని అమలు చేస్తూ విద్యార్థులు బృందాలుగా కేటాయించి మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్,రాములు,గంగాధర్, రవి, నవీన్, దేవానంద్,సప్న,చక్రపాణి, భూపతి, విజయ, కృష్ణప్రసాదు పాల్గొన్నారు.

## పంటలకు సాగునీరు అందించండి

**సూర్య వేల్పూర్**



శ్రీరామ్ సార్ ప్రాజెక్టు నుండిలక్ష్మి కెనాల్, కాకతీయ, వరద కాలువల ద్వారా అవసరం మేర నీటి విడుదల చేసి సాగునీటి కొరతను తీర్చాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఎస్సీనీ కోరారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అధికారులు దీనిపై దృష్టి సారించి నీటి విడుదల చేయాలని కోరారు. వరద కాలువల ద్వారా నీటి విడుదల చేసినట్లయితే గతంలో ఏర్పాటు చేసిన తూముల ద్వారా చెరువుల్లోకి మళ్లించుకుంటారని దానివల్ల సాగునీటిపారుదలకు ఆటంకం లేకుండా ఉంటుంది అన్నారు. వరద కాలువ ద్వారా పోచంపల్లి అంక్సాపూర్ కుక్నూరు కోమన్పల్లి ,దొనకల్, తదితర గ్రామాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీరు విడుదల చేయాలని ఆయన ఎస్సీ ని కోరారు. అలాగే గ్రామాల్లో లక్ష్మీ కాలువ సరస్వతి కాలువల ద్వారా నీటిపారుదల కొనసాగినట్లయితే పంట పొలాల కు నిరంతరా అవకాశముంటుందని లేనియెడల పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లి అవకాశం ఉందని ఆయన అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించి నీటి విడుదలపై అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## మాలల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ

**సూర్య బాన్సువాడ రూరల్**



బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామంలో మంగళవారం మాలల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరించారు.ఈనెల 27 ఆదివారం మాలల ఆత్మీయ సమ్మేళనం బాన్సువాడ పట్టణం మీనా గార్డెన్ లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, మాలలుఅందరిని ఏకతాటి పై తీసుకురావడానికి సంఘ నాయకులు జిల్లాలోని గ్రామ, గ్రామాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్నారు.మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,మాలల రిజర్వేషన్ల కోసం, మాలల హక్కుల కోసం పోరాటం చేస్తుందని కావున మాలలందరు అధిక సంఖ్యలో హాజరై ఆత్మీయ సమ్మేళనం ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల సంఘం డివిజన్ నాయకులు ప్రశాంత్ కుమార్,బిచ్కుంద రాములు, జంగం సాయిలు, అయ్యాల పోచారం, ,న్యాలకంటి గంగాధర్,న్యాలకంటి సంతోష్, బిచ్కుంద రాజు,రాములు, జంగం రాజు, ప్రేమ్,బిచ్కుంద బాలయ్య,రెడ్డి ఆనంద్, సాయి కృష్ణ, సాయి కుమార్, బాలకృష్ణ, అస్కుల సంజీవ్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బిజెపి నేతలు

**సూర్య- నసురుల్లాబాద్**



కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంసంగెం తండాలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో చివరి రోజైన మంగళవారం బిజెపి నేతలు పాల్గొన్నారు. తీజ్ పండగ ను పురస్కరించుకుని గ్రామానికి చెందిన పకీర నాయక్ గృహంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పైడిమల్ లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి , నాయకులు అరిగే నారాయణ , అశోక్ నాయక్, రమేష్ నాయక్, దశరథ్ నాయక్ హెూమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని తిప్పాపూర్ గ్రామా నికి చెందిన బోయిని నాగవ్వ అనే మహిళ అనారోగ్యంతో చనిపోవడంతో విషయం తెలుసుకున్న మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపారి భీమ్ రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి నాగవ్వ భర్త కిష్టయ్యకు నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండ గా ఉంటానని వారికి భరోసా కల్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో తనవంతుగా ఆర్థిక సహాయం చేసిన భీమ్ రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బాల్కొండ లో పోలీసు కళాజాత బృందం చే అవగాహన

సూర్య బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, రాత్రి ,రోడ్డు ప్రమాదాలు, మూడ నమ్మకాలు,సామాజిక రుగ్మతల నిర్మూలన,సోషల్ మీడియా ద్వారా మోసాలు,ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలు తదితర అంశాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాజాతా ప్రదర్శన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పోలీసు కళాజాత బృందం నిర్వహించిన ఈ కార్యక్రమా నికి గ్రామ ప్రజల నుంచి మంచి అనూహ్య స్పందన లభించి oది.బాల్కొండ ఎస్ఐ కే. శైలేందర్ కార్యక్రమ ంలో పాల్గొని ప్రసంగించారు. నిజామాబాద్ జిల్లా పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీసు కలజాత బృందం చే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కే శైలేందర్ తెలిపారు.రోడ్డు పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత నియమాలు




తప్పని సరిగా పాటించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 100 కు ఫోన్ చేయాలని,మొబైల్ పోయిన, దొంగిలించిన సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మల్లి మొబైల్ తిరిగి పొందవచ్చని తెలిపారు. మంత్ర, తంత్రాలు వంటి మూడ నమ్మకాలను నమ్మవద్దని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు.సైబర్ మోసాల నుండి రక్షణ కోసం అప్రమత్తంగా ఉండాలని,ఏదైనా మోసానికి గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫోన్ చేయాలని తెలిపారు.గల్ఫ్ దేశాలకు వెళ్ళేవారు అప్రమత్తంగా ఉండాలని,నకిలీ ఏజెంట్లు నిరుద్యోగులను మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.మత్తు పదార్థాలు జీవితాలని నాశనం చేస్తాయని,మాదకద్ర వ్యాల వినియోగం నేరమని,చట్టపరమైన శిక్షకు లోనవుతారని, యువత మాదకద్రవ్యాలనుంచి దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలందరూ శాంతియుతంగా కలసి మెలిసి ఉండాలని,సమాజంలో జరుగుతున్న నేరాలు,చట్టాలపై పోలీసు కళాజాత బృందం ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించినట్లు ఎస్ఐ కే శైలేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు కళాజత బృందం సభ్యులు, పోలీసు సిబ్బంది, మండల విద్య శాఖ అధికారి బట్టు రాజేశ్వర్, ప్రాధానోపాధ్యాయులు విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నూతన రేషన్ కార్డుల పంపిణీ

సూర్య నిజాంసాగర్



మండలంలోని గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నూతన రేషన్ కార్డులను మంగళ వారం పంపిణీ చేశారు. మాగి, వడ్డేపల్లి, మల్లూరు, జక్కాపూర్, గోర్గల్ గ్రామాల్లో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, తహసిల్దార్ బిక్షపతి ల చేతుల మీదుగా రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. నిజాంసాగర్ మండ లంలోని గ్రామాలకు నూతనంగా 136 రేషన్ కార్డులు మంజూరయ్యాయ ని, రేషన్ కార్డుల్లో నూతనంగా పేర్లు నమోదు చేసుకున్న కార్డులు 1024 వచ్చాయని వాటిని లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తహసి ల్దార్ బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ హైస్కూల్ లో ఘనంగా బోనాల పండగ

సూర్య- బిక్కనూర్



మండల కేంద్రంలోని స్థానిక విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆషాడ మాస బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అందంగా అలంకరించిన బోనాలను డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా మహంకాళి ఆలయం వరకు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వేసిన అమ్మవారి, పోతురాజుల వేషధారణ పట్టణ ప్రజలకు ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు నిర్వహించుకునే బోనాల పండుగను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు.పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థులకు తెలంగాణ సాంప్రదాయాలను, భారత దేశ సంప్రదాయాలను నేర్పించడంలో విజ్ఞాన్ హైస్కూల్ అనేక రకాలుగా కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు

### - అనర్హులకు ఇచ్చారని మహిళల ఆందోళన

సూర్య- బిక్కనూర్




మండల కేంద్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయం లో నిర్మించిన 50 డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు కార్యక్రమం మంగళ వారం ఆందోళన మధ్య నిర్వహి ంచారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు లాటరీ పద్ధతిన డబుల్ బెడ్ రూములను కేటాయిం చారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. దీంతో డబుల్ బెడ్ రూమ్ లలో పేర్లు రాని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎలాంటి ఇంటి స్థలాలు, భూములు లేని అర్హులైన జాబితా నుండి తమను తొలగి ంచి, రాజకీయ పార్టీల నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారి డబుల్ బెడ్ రూమ్ లు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారని, ప్రకటించిన లబ్ధిదారులలో చాలామందికి ఇంటి స్థలాలు ఉన్నాయని, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని వారిని గుర్తించి వారికి కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ లను అర్హులైన వారికి అందిం చాలని, లేనిచో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. దీంతో ఎమ్మార్వో సునీత మాట్లాడుతూ తాను రెండు నెలల క్రితమే బాధ్యతలు చేపట్టానని, లబ్ధిదారుల లిస్టు గతంలోని తయారు చేశార ని ఆందోళన చేస్తున్న మహిళలకు వివరించారు. లబ్ధిదారులకు కేటాయిం చిన డబుల్ బెడ్ రూంలలో ఎవరైనా ఉద్యోగస్తులు, అనర్హులు ఉంటే ఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని ఎమ్మార్వో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యనిర్వాహణాధికారి మహేష్ గౌడ్,విద్యుత్ ఏఈ సంకీర్త్, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు, మహిళలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించండి

సూర్య వేల్పూర్



వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించి పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ వీణ అన్నారు .వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగాఉంచుకోవాలని అన్నారు. పాత కూలర్లు గాని కొబ్బరి బోండాలు కానీ పాత సీసాలు పాత టైర్లు వాటిల్లో నీటి నిల్వ ఉంటుందని దానివల్ల దోమలు వాటిపై వాలి గుడ్లు పెట్టడం వల్ల దోమల సంఖ్య పెరిగి చికెన్ గునియా ,మలేరియా ,టైఫాయిడ్, డెంగ్యూ ,వ్యాధులు విస్తరిస్తాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని ఏఎన్ఎం లకు సరిపడా సీజనల్ వ్యాధుల పట్ల కావాల్సిన మందులను సరఫరా చేసామని ఏదైనా వ్యాధుల పట్ల అజాగ్రత్త వహించకుండా వారిని సంప్రదించినట్లయితే తగు సూచనలు చేస్తూ వైద్య సహాయం అందిస్తారని తెలిపారు.

## అధ్యాపకులను నియమించాలని విద్యార్థుల రాస్తారోకో

సూర్య- బిక్కనూర్




మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేస్తూ టీజీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు మంగళవారం సినిమా టాకీస్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం బైపిసి కోర్స్ వచ్చిందని, కోర్సు కు సంబంధించిన బయాలజీ బోటనీ,కెమిస్ట్రీ సబ్జక్ట్ లను బోధించేందుకు ఇప్పటివరకు కళాశాలలో నియమించలేదని, ఈ విషయంపై ఇంటర్మీడియట్ నోడల్ అధికారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నత విద్యాశాఖ అధికారులు ఖాళీగా ఉన్న మూడు సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వం చెలగాటం ఆడ వద్దని హెచ్చరించారు. ఇప్పటికైనా వెంటనే పర్మినెంట్ గా అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ సమీర్, మండల అధ్యక్షుడు భరత్, కార్తీక్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వైభవంగా ముగిసిన తీజ్ ఉత్సవాలు

సూర్య -నస్రుల్లాబాద్



.బంజారాలు భక్తిశ్రద్ధలతో పరమ పవిత్రంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించిన తీజ్ ఉత్సవాలుమంగళవారంతో ముగిశాయి.నసురుల్లాబాద్ మండలం సంగంతండాలో తొమ్మిది రోజులు పాటు ఘనంగా వేడుకలు నిర్వహించారు. వివాహం కాని యువతులుతమ జీవితంలోకి మంచి వరుడు రావాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని, పాడిపంటలతో తండాలు సుభిక్షంగా ఉండి, ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి నిర్వహించే ప్రకృతి పండగే తీజ్ పండుగ.బంజారా సంస్కృతిని కాపాడి రాబోయే తరాలకు అందించడమే గిరిజనుల లక్ష్యం. ఉత్సవాలను పురస్కరించుకుని తాండవాసి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీజ్ పండుగను అధికారికంగా నిర్వహిస్తూ బడ్జెట్ ను కేటాయించాలన్నారు . తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజన బాలికల గురుకుల, హాస్టల్లలో పాఠ్యపుస్తకాల్లో తీజ్ పండుగ ప్రత్యేకత గురించి పొందుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల్లో తాండవాసులు ప్రతి ఒక్కరూ పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వేడుకలు ముగించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు యువత సన్నద్ధం కావాలి

### -యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్

సూర్యలింగంపేట్



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి యువత ముందుకు రావాలని మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర రామ కృష్ణ గౌడ్ అన్నారు. ఆయన మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశాల మేరకు లింగంపేట్ మండ లంలోని బాయిన్పల్లి గ్రామ యూత్ కమిటీ సభ్యు లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున యువత రాజకీయల్లోకి రావలాన్నారు .కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి ఇంటింటికి తీసుకు వెళుతు స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీకి అధిక శాతం సీట్లు వచ్చే విధంగా యువత కృషి చేయాలన్నారు.ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయ కులు బిట్ల లింగం,బేస్తా నవీన్, సంగమేశ్వర్, బాయంపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిలు గ్రామ యూత్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూర్య- నవీపేట్:

నవీపేట్ సెక్షన్ పరిధిలో గల 13/11 కెవి రాంపూర్ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 03:30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు శాఖ ఏడిఈఈ ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున 13/11 కెవి రాంపూర్ పరిధిలో గల విద్యుత్తు వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరినారు.

# దేశవ్యాప్తంగా బౌద్ధుల శాంతియుతంగా హక్కుల సాధనకై ఉద్యమం

## - బౌద్ధ ధర్మ రక్షణ ఉద్యమం - జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహాధర్నా

**సూర్య ఇందూర్**

బోధ్ గయా – ప్రపంచానికి బుద్ధుడు జ్ఞానోదయం పొందిన పవిత్ర ధమ్మభూమి. కానీ అదే భూమిలో బౌద్ధులు పరాయివారిలా ఉండాల్సి వస్తోందని ఇది సనాతన ధర్మానికి,భారత రాజ్యాంగానికి,బౌద్ధ ధమ్మానికి పూర్తి విరుద్ధమని అన్నారు. బోధ్ గయాలో బుద్ధుని జ్ఞానోదయ స్థలమైన మహాబోధి మహావిహార్‌ను పూర్తిగా బౌద్ధుల నియంత్రణలోకి తీసుకురావాలనే లక్ష్యంతో,దేశవ్యాప్తంగా బౌద్ధులు ఒక గొప్ప చారిత్రాత్మక ఉద్యమం చేస్తున్నామన్నారు. ఈ ఉద్యమంలో భాగంగా, పూజ్య భిక్షు భంతే బుద్ధఘోష్ ఆధ్వర్యంలో, 2025 జూలై 21వ తేదీ నుంచి 10 రోజుల శ్రామణేర్ శిబిరం శాంతి యుత ధర్నా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. వీటి ఆక్ట్ 1949 అనేది బీహార్ ప్రభుత్వం



రూపొందించిన చట్టమని, ఈ చట్టం ప్రకారం, మహాబోధి మందిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ట్రస్టు బోర్డులో బౌద్ధులు మెజారిటీలో ఉండకూడదు అన్న నిబంధన ఉందనీ, దీంతో,ప్రపంచ బౌద్ధ సంస్కృతి కేంద్రమైన ఈ స్థలంపై బౌద్ధులకు పూర్తి హక్కు ఉండకపోవడం వల్ల,ఇది ఒక విధమైన ధార్మిక అన్యాయంగా నిలుస్తోందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయడమంటే కేవలం చట్ట విరోధం కాదనీ, ఇది బౌద్ధుల ఆత్మగౌరవాన్ని, హక్కులను తిరిగి తీసుకునే యుద్ధమని అన్నారు. బుద్ధుడు సమానత్వాన్ని బోధించాడు. కానీ బోధ్ గయాలో బౌద్ధులే అన్యాయంగా అణచివేయబడ్డారన్నారు. వేలాది సంవత్సరాల నుంచి బౌద్ధ ధమ్మానికి జీవం లాంటి స్థలాన్ని, బౌద్ధులు నడిపించలేక పోవడం,ఒక జాతిగా మన హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఎంత బాధాకరమని అన్నారు. ఇది కేవలం శిబిరం కాదు, ధమ్మరక్షణ యాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంబ్లె దేవిదాస్ ప్రధాన కార్యదర్శి దయానంద సోలంకి కోశాధికారి సంజయ్ గంగానే ఉపాధ్యక్షులు వాగ్మారే అంతేశ్వర్,అశోక్ భగ్యవాన్. గౌతమ్ కంబ్లె తో పాటు బౌద్ధ మతస్తుల పెద్దలు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంలో నూతన అధ్యాయం స్వర్ణ వెంచర్ ప్రారంభంలో వెంచర్ డైరెక్టర్ పి.రమేష్ బాబు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి పట్టణంలో రియల్ ఎస్టేట్ రంగంలో నూతన ఉరవడిలో మంగళ వారం రోజున కామారెడ్డి పట్టణ శివారులో గల లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో స్వర్ణ ఎంక్లేవ్ వెంచర్ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రియల్ ఎస్టేట్ ప్రముఖ వ్యాపారవేత్తలు కామారెడ్డి జిల్లా క్రెడా అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వెంచర్ డైరెక్టర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ కామారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో ఈ వెంచర్ ప్రారంభించడం జరిగింది. ప్రజలకు అందుబాటులో సరసమైన ధరలకే ఈ ప్లాట్ లను లేఔట్ చేయడం జరిగింది అన్ని అనుమతులతో వెంచర్ను ప్రారంభించడం జరిగిందని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని వసతులతో వెంచర్ను ఏర్పాటు చేశామని తెలిపారు. దీంట్లో ప్రత్యేకంగా 30 ఫీట్ల బీటీ రోడ్డు తో పాటు 100% వాస్తు యోగ చేసుకోవడానికి సకల సదుపాయాలతో రెవెన్యూ ప్లాంటేషన్ పంచవటి పార్క్,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఓపెన్ జిమ్, విద్యుత్తు లైట్లతోపాటు అవుట్డోర్ బ్యాడ్మింటన్ కోర్ట్,ఫుట్పాత్,తో ప్రత్యేక ఆకర్షణగా తదితర వసతులతో లేఅవుట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వచ్చే నెల ఆగస్టు 4 నుండి బుకింగ్స్ ప్రారంభమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వసుంధర బిల్డర్స్ డైరెక్టర్స్ రిషి అగర్వాల్,వరుణ్ అగర్వాల్, సీతా దేవి, సందీప్,మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నూడ చైర్మెన్ కేశ వేణు ను సన్మానించిన,వాకర్స్ కమిటీ సభ్యులు



**సూర్య ఇందూర్**

నిజామాబాద్ నగరంలోని ఐటీఐ కాలేజ్ గ్రౌండ్ లో మంగళవారం ఉదయం వాకర్స్ కమిటీ సభ్యులు నూడ చైర్మన్ కేశ వేణు ను ఆహ్వానించారు. అక్కడికి చేరుకున్న నూడా ఛైర్మెన్ కేశ వేణు వాకర్స్ సమస్యలు తెలుసుకుని వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వాకర్స్ కమిటీ సభ్యులు ఛైర్మెన్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## వెల్లుట్ల లోఘనంగా పెద్దమ్మ తల్లికి బోనాలు

**- వర్షాలు సమృద్ధిగా కురవాలి, పాడిపంటలు పండాలి, సల్లంగా చూడు పెద్దమ్మ తల్లి**

**సూర్య,ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామలో మంగళవారం పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయం ఎదుట పచ్చని పందిరి వేసి ముగ్గులతో అందంగా అలంకరించారు. ఉదయం నుండే మహిళలు, యువతులు, చిన్నారి పిల్లలు తలంటు స్నానం చేసి ఇళ్ల ముందు వాకిళ్లలో కల్లాపి చల్లి ముగ్గులు పెట్టి పల్లె వాతావరణం మార్చి వేశారు అనంతరం మహిళలందరూ అందంగా ముస్తాబైనారు. పలువురు మహిళలు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం పోశారు. అనంతరం నూతన వస్త్రాలు ధరించిన మహిళలు తమ ఇళ్ల నుండి బోనాలు ఎత్తుకొని డీజే చప్పుళ్ల, భాజా భజంత్రీల సందడి నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు చేరుకున్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ ఐదు మార్లు ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండేలా దీవించాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఊరేగింపులో పలువురు బోనం ఎత్తుకొని చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జక్కుల సంతోష్ కుమార్ ముదిరాజ్, బైండ్ల పోచన్న, ముదిరాజ్ మాజీ సర్పంచ్ గంట సాయిలు ముదిరాజ్, సొసైటీ చైర్మన్ ,ముదిరాజ్ , , గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్సై కి సన్మానం

**సూర్య,భీమ్‌గల్**



ఇటీవల బదిలీపై వచ్చిన నూతన ఎస్సై కే.సందీప్ నీ ఎం.ఈ.ఓ. స్వామి ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గంజాయి, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు,రోడ్డు భద్రత, కెరీర్ గైడెన్స్ గురించి అవగాహన కల్పించాలని కోరగా అతి త్వరలో చేపడతామని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, వాసుదేవ్,వినోద్ సాగర్, శివకుమార్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల వేడుకలలో విద్యార్థులు అలరించిన పోతరాజు వేషధారణ సాంప్రదాయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు దామోదర్ వేసిన పోతరాజు వేషాధారణలో అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల విద్యార్థులకు ప్రత్యక్ష అనుభూతి కలిగించాలని ఉద్దేశంతో బోనాల వేడుకలను నిర్వహించామన్నారు. విద్యార్థులు అమ్మవారి ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ,శివానంద,లావణ్య,విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**సూర్య- నవీపేట్**



స్థానిక సంస్థల ఎన్నికలలో భాజపా అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కమలదళం పనిచేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక ఎన్నికల కన్వీనర్ వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. మండలంలో గల ఏంఆర్ఎల్ గార్డెన్ పోతంగల్ లో మండల బిజెపి అధ్యక్షులు ద్యాగ సరీన్ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. నాళేశ్వర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కారడి లక్ష్మణ్ బిజెపిలో చేరారు. మండల ఎన్నికల కమిటీ కన్వీనర్ గా బందెల ఆనంద్ ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో భాజపా అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కమలదళం పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పథకాలను, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిన అధికార పార్టీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరూ సమన్వయంతో పని చేస్తే విజయం మనదే అవుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి భాజపా సముచిత న్యాయం కల్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో శైలేష్ కుమార్, పిల్లి శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, భూషణ్, నాగభూషణం, గణేష్, రాము, రాజశేఖర్, ప్రవీణ్, గోపాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్లం ఏఎంసీ చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి సన్మానం

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని మల్లూరు గ్రామలో మంగళవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాం సాగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ లను మల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీని వాస్ రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెద్ది అంజయ్య, శేఖర్, గొల్ల హన్మాండ్లు, రాజులు, బుడిమి శ్రీని వాస్, బుడిమి మైశయ్య , బాల్ రాజ్, సంజీవ్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు పొలం బాట

**సూర్య- నవీపేట్:**



మండలంలో గల అనంతగిరి గ్రామంలో మంగళవారం పొలం బాటలో భాగంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తుగా చర్యలు తీసుకోవడం ద్వారా స్వాధ్యమైనంత వరకు విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని విద్యుత్ శాఖ ఏడిఈఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటార్లకు కెపాసిటర్ లు బిగించుకుంటే కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ట్రాన్స్ఫార్మర్, ట్రాన్స్ఫార్మర్ లైన్ సర్వీస్ వైర్స్ వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు, కెపాసిటర్, కెపాసిటర్ అవశ్యకత మరియు విద్యుత్ ప్రమాదాలు, జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు తడిచేతులతో స్టార్టర్ బాక్సులు ముట్టుకోకూడదని, ఐరన్ స్టార్టర్ బాక్సులు బదులు ప్లాస్టిక్ స్టార్టలను వాడుకోవాలని వెల్లడించారు. ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నెంబర్ కు కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా పోలీస్ స్టేషన్ ల నెలవారి సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష చేస్తూ, ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో SOP ప్రకారం నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరగాలని ఆయన సూచించారు. విపీఓలు గ్రామాల్లో సందర్శించినప్పుడు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలతో కలిసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, సమాచారం వేగంగా చేరేలా చూడాలని సూచించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా పరిశీలించి, రిపేర్ అవసరమైతే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గొడవలకు కారణమయ్యే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చిన్న ఘటనకైనా సమాచారం వచ్చే విధంగా గ్రామస్థులతో బలమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బిరాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఫ్రీ & ఫెయిర్ ఎన్నికల నిర్వహణే లక్ష్యం. ప్రతి పోలీస్ అధికారి గ్రామాల పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి. సోషల్ మీడియాలో అసాంఘిక ప్రచారంపై పటిష్ట నిఘా ఉంచాలి. చెడు ప్రవర్తన గల వారిపై బైండోవర్ చర్యలు తీసుకోవాలి. పోలీసులు ప్రజలతో మమేకమై సమాచారం సేకరించి, ఎన్నికల వాతావరణాన్ని భద్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది అని జిల్లా ఎస్పీ అన్నారు. డయల్ 100 ద్వారా కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం తగదు అని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఎస్‌హెచ్ఓ వాహనాలను తనిఖీ చేస్తూ, ప్రతి వెహికల్‌ను రెగ్యులర్ సర్వీస్ చేయించాలని, ఎలాంటి రిపేర్స్ ఉన్నా తక్షణమే నివృత్తి చేస్తూ, వెహికల్ పూర్తి స్థాయిలో కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవరులకు సూచించారు. ఈ వాహనాల తనిఖీలలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ సంతోష్ ఉన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసరావు, విట్టల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఇతర సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

**- కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎల్.ఆర్.ఎస్ అంశాలపై కలెక్టర్ మంగళవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వార్డు ఆఫీసర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా పై అంశాల అమలు, సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో అలసత్వ వైఖరితో వ్యవహరిస్తున్న ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. ఈ తరహా వైఖరిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల వివరాలను రెండు రోజుల్లోగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్ లో ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని, వారికి ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సుముఖంగా లేని లబ్ధిదారుల నుండి లిఖిత పూర్వకంగా లేఖలు తీసుకోవాలని, వారి స్థానంలో అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు జాబితా రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను పాటిస్తూ, అర్హులైన వారికి 15 రోజుల్లో పు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, వన మహోత్సవం కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరు చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. వర్షాల కోసం ఎదురు చూడకుండా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను, విద్యార్థులను, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, అన్ని నివాస ప్రాంతాలలో ఫాగింగ్ చేయించాలని అన్నారు. ఎక్కడ కూడా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటివి ప్రబలకుండా దోమల నియంత్రణ చర్యలను విస్తృతం చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించాలని సూచించారు. కాగా, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు సత్వరమే ప్రొసీడింగ్ పత్రాలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని మండల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మనిగిరి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కళాలి అజయ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి అశ్వక్ చేతుల మీదగా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. వీరితోపాటు ముస్తాపూర్ గ్రామంలో నూతన రేషన్ కార్డులను అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసుల శివకుమార్, బండ రమేష్, మాసుల కృష్ణమూర్తి, ఆర్కారి ఆగమయ్య, బండ రమేష్, కీసర అజయ్, దాసరి శ్రీనివాస్, నిజ్జన నరేష్, పిట్ల వెంకటి, తెల్లారి అనిల్ కుమార్, అశోక్, కాంతారెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్ గౌడ్, పెద్ద కాంతం, వడ్ల రవి, సమ్మరి పోచయ్య, కొప్పుల పోచయ్య, మాల కమ్మరి కఫీల్, ఎర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు

**- పిట్లం ఏఎంసి చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్**

**సూర్య నిజాంసాగర్**



అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు వస్తాయని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ లు అన్నారు. మంగళవారం వడ్డేపల్లి, మల్లూరు గ్రామాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతాయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పక్షపాతి అని పేదల కోసం పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో రేషన్ కార్డులు రానివారు ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బిక్షపతి, జూనియర్ అసిస్టెంట్లు మల్లేశం, అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శులు సంతోష్, సతీష్, భారతి, యోగేష్, రేషన్ డీలర్లు సిహెచ్ ఎల్లయ్య, వెంకట్రాములు, శేఖర్, దేవేందర్ రెడ్డి లతో పాటు ఆయా గ్రామాల నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సేవే మార్గం - అవగాహనే లక్ష్యం....

**- జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు**

**సూర్య ఇందూరు**



ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు - సామాజిక బాధ్యత కలిగించేలా అవగాహన కల్పించటం జరుగుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయి బాబు తెలిపారు. విద్యార్థులకు ఇప్పటినుండే సామాజిక బాధ్యత మరియు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించటం ద్వారా వారంతా మంచి మార్గం వైపుగా నడిచేందుకు అవకాశం ఉంటుందన్నారు ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. సర్విస్ ఫిల్డ్ వర్కు లో విద్యార్థులు నేరూగా పాల్గోంటు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని వారు చేసే కార్యక్రమాలు చూడటం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ ప్రాజెక్టు అనేది జిల్లాలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మెదలు పెట్టడం జరీగిందన్నారు. అనాధలు అభాగ్యులు నిరాశ్రయుల విధివంచితులు రోడ్లపై ఎలాంటి అవస్థలు పడుతున్నారు వృద్దాప్యంలో వచ్చే ఇబ్బందులు కుటుంబాలకు దూరమైన విదివంచితుల దుస్థితి విద్యార్థులకు విడియె ప్రెజెంటేషన్ ద్వారా తెలపటం జరిగింది తల్లిదండ్రులు, సమాజం, పెద్దల పట్ల ఎలా నడుచుకోవాలో వివరించటం జరిగింది ఈ ప్రాజెక్టు నిరంతరం కోనసాగుతుందని తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆత్మగౌరవ గర్జనను విజయవంతం చేయాలి

**-బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్**

**సూర్య,లింగంపేట్**



లింగంపేట మండల కేంద్రంలో ఈనెల 25 న బిఆర్ఎస్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ గర్జనను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఆత్మగౌరవ గర్జనను సకాలంలో వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, మాజీ మండల పరిషత్ ముదాం సాయిలు, సొసైటీ చైర్మన్ రమేష్, మాజీ సర్పంచులు అనిల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నర్సింలు, బండి నర్సింలు, లక్ష్మణ్, సాయ గౌడ్, సత్యం, రవిందర్, కిషన్, చంద్రయ్య, మహేష్, సర్వన్, సురేందర్, సిద్ధ రాములు, రూప్ సింగ్, మేకల రాములు, పరువయ్య, పాల సాయిరాం, చాకలి రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

**-బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు క్రాంతి**

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని మంగళవారం బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ బిజెపి నాయకులతో కలిసి తహసిల్దార్ సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక మండల ప్రజలు తాడ్వాయి, ఎల్లారెడ్డి, కామారెడ్డి వెళ్లవలసిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నూతన విద్యార్థులకు ఆదార్ లేకుండా స్కూల్లో అడ్మిషన్లు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. వెంటనే మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జంక్షన్ దత్తు రాములు, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచంద్ర చారి, బిజెపి నాయకులు సుభాష్, కోల అల్లూరి, దూరిశెట్టి రవి, గుళ్ళు గణేష్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.